క్లుప్తంగా

నేడు పట్టణంలో గడప గడపకూ..

రామచంద్రపురం: పట్టణంలోని 18వ వార్డు కవలవారిసావరం, 17వ వార్డు ముచ్చుమిల్లి ప్రాంతాలలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని శీలంవారిసావరంలోని 33–11 కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతులు నిర్వహిస్తున్నామని దీని కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శీలంవారిసావరం, రైలు గట్టు, రాజగోపాల్ సెంటర్, వైఎస్సార్ నగర్, శాంతినగర్, గణేష్‌నగర్, వెల్ల రోడ్డు, ఆర్టోస్ ఫ్యాక్టరీ, తోటవారివీధి, అఫీషియల్ కాలనీ, వెల్ల వాటర్ వర్క్స్, ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయటం జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు విద్యుత్ అంతరాయం

కాజులూరు: మండలంలోని కుయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం .సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్ స్టేషన్ మరామ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఇంటిగంట వరకూ దుగ్గుదుర్రు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన అవసరం



మెర్నిపాడులో ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

కపిలేశ్వరపురం (మండపేట): క్షయవ్యాధి లక్షణాలు, నిర్మూలనా పద్ధతులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని క్షయవ్యాధి నిర్మూలనా ప్రత్యేక కార్యక్రమం పర్యవేక్షణాధికారి డాక్టర్ ప్రశాంతి అన్నారు. మండపేట మండలం డి.కేశవరం పీహెచ్‌సీ పరిధిలోని మెర్నిపాడు గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలోని పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. లక్షణాలు ఉన్నవారి వివరాలను నమోదు చేసుకుని పీహెచ్‌సీని సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణానికి చెందిన ఫైర్‌వర్క్ కార్మికుడు ఉండుర్తి సత్తిబాబు నెల రోజులు క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త వేగుళ్ల చైతన్యబాబు బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేలు సాయం చేశారు. ఆయన సమకూర్చిన సాయం సొమ్మును వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, నాయకులు షేక్ ఆలీఖాన్‌బాబా, 7వ వార్డు పార్టీ కన్వీనర్ కొడమంచిలి భాస్కరరావు, నాయకులు సాధనాల శివ, ఉండ్రాజవరపు అర్జున్, రమేష్‌లు మృతుని తల్లి చిట్టెమ్మకు అందజేశారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

రాయవరం: రహదారి భద్రత మన అందరి బాధ్యత అని రామచంద్రపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం రహదారి భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు. తొలుతగా విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రమాణం చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి 'ఆసరా'

- నాలుగో విడత చెక్కుల పంపిణీ
- పాల్గొన్న ఎంపీలు అనురాధ, బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్



కాజులూరు ఆసరా సభలో మహిళలకు చెక్కును అందజేస్తున్న నాయకులు



కాజులూరు ఆసరా సభకు హాజరైన మహిళలు

కాజులూరు: నియోజకవర్గంలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గత ఎన్నికల్లో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణమాఫీ హామీని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు విడతల్లో పూర్తి స్థాయిలో అమలు చేయటంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జగనన్న ప్రభుత్వంలో అందిన ఆసరా సొమ్ములతో తమ కుటుంబాలను చక్కదిద్దుకున్నామని అక్కచెల్లెమ్మలు చెబుతున్నారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగనన్నకే తమ మద్దతు అని ముక్తకంఠంతో చెబుతున్నారు. బుధవారం కాజులూరు జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో నాలుగో విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్, ఎంపీ చింతా అనురాధ, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు మండలంలోని 1500 డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత అసరాగా రూ.12.49 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ మహిళలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా చేదోడుగా నిలుస్తున్నారన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళలను రాజకీయంగా ముందుకు తీసుకువచ్చిన జగనన్న దాదాపు అన్ని పథకాలు కుటుంబాన్ని చక్కదిద్దుకునే మహిళలకే నేరుగా బ్యాంకు ఖాతాలకు అందజేస్తున్నారు. జగనన్నకు వచ్చే ఎన్నికల్లో మహిళాలోకం తోడుగా నిలవాలని ఆమె కోరారు. రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడుతూ దేశంలో విలువలు కోల్పోతున్న రాజకీయాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరి పోశారన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ నాయకుడు చంద్రబాబు 640 హామీలిచ్చి 600 హామీలకు పైగా తుంగలో తొక్కారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నూరుశాతం హామీలను అమలు చేసి మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా దేశ చరిత్రలో నిలిచిపోయారన్నారు.

సంక్షేమ పథకాలతో అండగా

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు వంటి పథకాలను అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. పథకాల లబ్ధిని నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. రుణమాఫీ హామీని పూర్తి స్థాయిలో అమలు చేసారు.

– పిల్లి సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్

కర్రీ పాయింట్‌తో ఉపాధి



డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. స్త్రీ నిధి రూ.50 వేలు వచ్చింది. కాజులూరు కృష్ణుని గుడి సెంటర్‌లో కర్రీ పాయింట్ పెట్టుకుని ఉపాధి పొందుతున్నాను. ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా రూ.32 వేలు వచ్చింది. ఇది నా వ్యాపార అభివృద్ధికి ఎంతో దోహదపడింది. జగనన్న మేలు మరువలేను.

– పెంటపాటి రామలక్ష్మి, శలపాక

పిల్లల చదువుకు ఉపయోగించాను



డ్వాక్రా సంఘం ద్వారా పొందిన రుణం సొమ్ములు పిల్లల చదువుకు ఉపయోగించాను. సంఘం మొత్తానికి రూ.2.80 లక్షలు రుణం పొందాం. వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.28 వేలు వచ్చింది. బ్యాంకు వాయిదాలు సకాలంలో చెల్లిస్తూ గౌరవంగా ఉంటున్నాం.

– టేకుమూడి దుర్గాభవాని, గొల్లపాలెం

జగనన్న మాట నిలబెట్టుకున్నారు



గత టీడీపీ పాలనలో చంద్రబాబునాయుడు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చిమోసం చేశారు. బ్యాంకుల్లో వడ్డీలు పెరిగిపోవటంతో బయట రెండు రూపాయల వడ్డీకి తెచ్చి బ్యాంకులకు కట్టాం. జగనన్న తాను అధికారంలోకి వస్తే అప్పటికి ఉన్న డ్వాక్రా రుణం మొత్తం నాలుగు విడతలుగా చెల్లిస్తానని మాట ఇచ్చి మొత్తం చెల్లించారు.

– ఇప్పి మంజుల, పెనుమళ్ల

పేదల అభ్యున్నతే జగన్ ధ్యేయం

- చైర్ పర్సన్ దుర్గారాణి
- ఎమ్మెల్సీ తోట చేతుల మీదుగా టిడ్కో ప్లాట్ల అందజేత



మండపేటలో లబ్ధిదారుకు టిడ్కో నమూనా తాళాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో మరో సువర్ణాధ్యాయం లిఖించబడింది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్రంలోనే అతి పెద్ద లేఅవుట్ ఏర్పాటు చేయగా ఆ లేఅవుట్‌లో నిర్మించిన టిడ్కో గృహాల్లోని 1068 ప్లాట్ల తాళాలను లబ్ధిదారులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా అందజేశారు. 128 ఎకరాలు భూమిని సేకరించి 5వేల మంది పేదలకు ఇళ్లు సమకూర్చాలన్న వైఎస్సార్ కల ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నెరవేరింది. పట్టణంలోని గొల్లపుంతలో బుధవారం ప్లాట్ల అప్పగింత కార్యక్రమం నేపథ్యంలో మహిళల సందడితో పండగ వాతావరణం నెలకొంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం, పీఎంఏవై (అర్బన్), వైఎస్సార్ జగనన్న నగర్ లోని మొదటి విడతగా మంజూరైన లబ్ధిదారులకు ప్లాట్లను అందజేశారు. మహిళల సంతోషం నడుమ సాగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రోటోకాల్ పాటించడంలేదంటూ అధికారులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు తగిన ప్రాధాన్యతను ఇవ్వడంలేదంటూ వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులపై అసహనం వ్యక్తం చేశారు. వేదికపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వ్యవహార శైలిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తప్పుబట్టారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మహిళలంతా సంతోషంగా ప్లాట్లను అందుకుంటున్న శుభసమయాన ప్రోటోకాల్ పాటించడంలేదన్న మాటలు మాట్లాడడం సరికాదన్నారు. టిడ్కో ఇళ్లను తామే నిర్మించామని ఎమ్మెల్యే వేగుళ్ల పదే పదే చెప్పుకోవడంపై ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గృహాలు నిర్మించిన మాట వాస్తవమే కాని ఎలాంటి సదుపాయాలు లేకుండా గత ఎన్నిక సమయంలో హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించిన మాటను గుర్తు చేస్తూ వారంతా ఎందుకు ప్లాట్లలో లేరని ప్రశ్నించారు. టిడ్కో గృహాల్లో తాగునీరు, ఇతర సదుపాయాలను పూర్తి చేసి ఇవ్వాలన్న తలంపుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల వైపు ఆలోచన చేసిందన్నారు. గృహాలు నిర్మాణంలో సైతం అవినీతి జరిగిందని, ప్లాట్ నిర్మాణానికి గత ప్రభుత్వం చెప్పిన లెక్కలు తప్పని వైఎస్సార్ సీపీ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణలు నిరూపిస్తూ అవినీతికి వ్యతిరేకంగా ఆందోళనలు సైతం చేసిన విషయాన్ని ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. టిడ్కో గృహ నిర్మాణంలో చదరపు అడుగుకి రూ.వెయ్యి నుంచి రూ.1200 ఖర్చయ్యే టిడ్కో ఇళ్లకు గత ప్రభుత్వం రూ.2,100 చొప్పున కాంట్రాక్టరుకు కట్టబెట్టిందన్నారు. ఒక్కో చదరపు అడుగుకి రూ.1,200 చొప్పున అవినీతికి పాల్పడడం ద్వారా టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ పేదలకు నివాస యోగ్యం కల్పించినందకు సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ పట్టణానికి ప్రసిద్ధ చిహ్నమైన కలువపువ్వును బొమ్మను తొలగించి తన తండ్రి విగ్రహాన్ని పెట్టుకున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు ప్రొటోకాల్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నాయకులు పట్టాభి రామయ్య చౌదరి మాట్లాడుతూ కాలనీలో టిడ్కో గృహాలను మంజూరు చేస్తామన్న పేరుతో అప్పటికే వ్యక్తిగత స్థల పట్టాలు పొంది ఉన్న పేదల నుంచి టీడీపీ నాయకులు తమ హయాంలో పట్టాలను వెనక్కు తీసేసుకున్నారన్నారు. టీడీపీ హయాంలో ఇళ్లకు కరెంటు సదుపాయం, ట్రాన్స్ ఫార్మర్లు, వాటర్ సదుపాయం, రోడ్లు వంటి సదుపాయాలు కల్పించలేక పోయారన్నారు.

14 వ వార్డు ప్రజలకు అందించిన బ్లాకును కౌన్సిలర్ శెట్టి కళ్యాణి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, జెడ్పీటీసీలు కురుపూడి భవాని, పుట్టపూడి అబ్బు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు, నాయకులు మేకా శ్రీనివాస్, పోతంశెట్టి ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ తాళ్ళ ఆశిష్ కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన అవధానం



ద్రాక్షారామ గీతా మందిరంలో అష్టావధానం

రామచంద్రపురం రూరల్: అయోధ్య బాల రాముని పద్యంతో అష్టావధాని దూపాటి రామాచార్యులు చేసిన అవధానం ఆహుతులను అలరించింది. ద్రాక్షారామలో సాహితీవేత్తగా పేరు పొందిన బీఎస్ నెప్రహా మాస్టారు 11వ వర్ధంతిని పురస్కరించుకుని నెప్రహా సాహితీ సమితి ఆధ్వర్యంలో ద్రాక్షారామ గీతా మందిరంలో బుధవారం అష్టావధానం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పృచ్ఛకులు అడిగిన నిషిద్ధాక్షరిని కాకరపర్తి దుర్గాప్రసాద్, సమస్యను వారణాసి బ్రహ్మాజీ, దత్తపది కొరుప్రోలు గౌరీనాయుడు, వర్ణన మహావాది సత్యవతి, చందోభాషణం ఓలేటి బంగారేశ్వరశర్మ, పురాణ పఠనం డాక్టర్ ర్యాలి శ్రీనివాసు, ఆశువులు జనార్దన స్వామి, మెహర్ సుజాత, రెడ్డి గంగరాజు, అప్రస్తుత ప్రసంగం బి.తిలక్ చేశారు. పాలన యందు ధర్మజుడు, భవ్యుడు, నవ్యుడు సద్గుణేంద్రుడను.. అంటూ నెప్రహా మాస్టారి గురించి చెప్పిన ఆశువు విశేషంగా ఆకట్టుకుంది. తొలుత నెప్రహా మాస్టారి కుమారుడు బి.గోపి తొలిపలుకులతోను, అతిథుల జ్యోతి ప్రజ్వలనతోను ప్రారంభమయింది. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, ఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిలక్‌బాబు, నెప్రహా సాహితీ సమితి గౌరవాధ్యక్షురాలు అంజనీదేవి, మండలేముల కాశీ విశ్వనాథ్, పోచినపెద్ది విఠల్, శతావధాని పోచినపెద్ది సుబ్రహ్మణ్యం, బందరు సూర్యకుమారి, పండితులు అడిగిన ప్రశ్నలకు చక్కని పూరణలు చేశారు. అనంతరం అవధాని రామాచార్యులు, పృచ్ఛకులను భగవత్ గోపి ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం



హసన్‌బాదలో ప్రాధాన్యతా భవనాలను ప్రారంభించి సర్పంచ్‌ను సత్కరిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్ బాదలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ చేతుల మీదుగా బుధవారం ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యప్రకాశ్ ఎంపీపీ అంబటి భవాని, ఎంపీటీసీ యెన్నం దేవి, ఉప సర్పంచ్ నీలా దేవీభవాని తదితరులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిబ్బన్‌లు కత్తిరించి ప్రాధాన్యతా భవనాలను ప్రారంభించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా పాలనను గ్రామస్థాయికి తెచ్చారన్నారు. ప్రభుత్వ పరమైన అన్ని రకాల సేవలు పొందడానికి గ్రామ సచివాలయం, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచి సేవలు అందించడానికి రైతు భరోసా కేంద్రం, గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిరంతరం జరిగేందుకు వీలుగా వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయడం, వాటికి సొంత భవనాలను నిర్మించడం సామాన్యమైన విషయం కాదని ఆయన అన్నారు. ప్రజల యోగక్షేమాల కోసం ముఖ్యమంత్రి పడుతున్న తపనకు ఈ భవనాలే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఏఓ ఎస్.సత్యప్రసాద్, వార్డు సభ్యులు, పలు శాఖల ఉద్యోగులు, వలంటీర్లు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లకు శ్రీకారం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ లక్ష్మీనారాయణ, పండితులు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకూ జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ ఆవరణలో ఉదయం 8.31 గంటలకు పందిరి రాట ముహూర్తానికి ఆలయ చైర్మన్ పెన్మత్స వాసు రాజు , ఆలయ పర్యవేక్షణాధికారి వీరభద్రరావు, ఆలయ పాలక మండలి సభ్యులు భూమిపూజ చేసి, పందిరి రాట నాటారు. ఆలయ అర్చకులు యనమండ్ర సవిత్ర తేజ, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిప్రసాద్, వేద పండితులు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి తదితర పండితులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, తెప్పోత్సవం తదితర ఏర్పాట్లు చేయనున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని నిబంధనలు పాటిస్తూ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.గంగబాబు, వలవల రామకృష్ణ, దండు వీరభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కొత్తపేటకు చెందిన మహాశివభట్లుబ్రహ్మారాజు–అమ్మాజమ్మ దంపతులు రూ.20,232 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

పక్షవాతం రోగికి ఆర్థిక సాయం



బాధితురాలి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో రెండు నెలలుగా మంచానపడిన బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.10,500 నగదు సాయాన్ని అందినట్టు సంస్థ సభ్యులు బుధవారం తెలిపారు. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన తాడి సత్యవతి రెండు నెలలుగా పక్షవాతంతో మంచాన పడ్డారు. కొడుకు ఇటీవల చనిపోయాడు. కూతురుకి మతిస్థిమితం లేదు. భర్త వృద్ధాప్యంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. వీళ్లను పోషించేవారు ఎవరూ లేక వైద్యం చేయించు కోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు మహేంద్రవాడ వెళ్లి సత్యవతి కుటుంబ సభ్యులకు సాయాన్ని అందజేశారు. అలాగే 25 కేజీల బియ్యాన్ని కూడా అందించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

రాజోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా లభించిన ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని కడలి గ్రామ సర్పంచ్ చొప్పల గుణనాథ్ అన్నారు. మండలంలోని కడలి గ్రామంలో బుధవారం నాచురల్ ఫార్మింగ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ ఫుడ్‌స్టాల్ ను సర్పంచ్ గుణనాథ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు ఆకుకూరలు మిల్లెట్స్, బెల్లం, చింతపండు, పప్పుధాన్యాలు మొదలైనవి రైతు వద్దకే నేరుగా అమ్మకాలు చేయడం సంతోషకరమని సర్పంచ్ అన్నారు. కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసు, జోసెఫ్, వీసీఏ శివరామకృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, కిరణ్, జూలీ చిట్టి స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కడలిలో ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్‌ను ప్రారంభించిన సర్పంచ్ గుణనాథ్

మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక



రామచంద్రపురం మండల సామాజిక తనిఖీలో నివేదికలు చదువుతున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ ఎన్‌వీవీ రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై గత నెల 24 నుంచి ఈ నెల 13 వరకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో 1467 పనులు చేపట్టి పూర్తి చేశారు. వేతనాల రూపంలో రూ.6,20,24,000, మెటీరియల్ రూపంలో రూ.7,77,389 ఖర్చు చేసినట్లు నివేదికలు చదివి వినిపించారు. మస్టర్‌లో ఉన్న తప్పులు, కొట్టివేతలపై వివరణ కోరి 12 గ్రామ పంచాయతీల్లో రూ. 13,164 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ ఏవీ శ్రీనివాస్, డీవీఓ కె.భీమేశ్వర్, ఏపీడీ కె.సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ సీహెచ్‌వీ సత్యనారాయణ, డీఆర్‌పీలు, ఏపీఓ, జేఈ, ఉపాధి హామీ టీఏలు, సీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



రాజోలులో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న డైరెక్టర్ మహేష్

రాజోలు: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని విజయవాడ జోనల్ చైర్మన్, ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ పిన్నింటి మహేష్ అన్నారు. బుధవారం ఆయన రాజోలు ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనలో ఆర్టీసీ కార్పొరేషన్‌ను ప్రభుత్వంలో విలీనం చేయడం అభినందనీయమన్నారు. రాజోలు డిపో పరిధిలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు, ఇతర సమస్యలపై బోర్డు సమావేశంలో చర్చిస్తామన్నారు. రాజోలు డిపో సెక్యూరిటీ భవనం పక్క నుంచి జాతీయ రహదారిపైకి డిపో లోపల నుంచి బస్సులు బయటకు వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీసీ యూనియన్ నాయకులు ఆయనకు వివరించారు. ఆర్టీసీ డిపో నుంచి బస్టాండ్‌కు లోపల వైపు నుంచి మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే 45 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగిన రాజోలు బస్టాండ్‌కు నూతన భవనం అన్ని సదుపాయాలతో నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పి.భాస్కరరావు, ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు ఎంఎస్ఆర్ మూర్తి, వాసు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి తేనెతో అభిషేకం



పెదపట్నంలంకలో షిర్డీ సాయిబాబా వార్షికోత్సవ పూజలో పాల్గొన్న మహిళలు

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలో కొలువు దీరిన షిర్డీ సాయిబాబా అయిదో వార్షికోత్సవంలో భాగంగా బుధవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ నుంచి తీసుకువచ్చిన బాబా పాదుకలకు ప్రత్యేక పూజలు జరిపించారు. గణపతి, గురుదత్తాత్రేయులకు సామూహిక పూజలు చేశారు. అనంతరం 54 లీటర్ల తేనెతో భక్తులు స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. దీంతో పాటు పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పిప్పళ్ల ప్రసాదరావు బృందం ఆలపించిన శ్రీసాయి సంకీర్తనావళి భక్తులను విశేషంగా అలరించింది. ఆలయంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. 2021 నుంచి ఏటా స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో కొలువుదీరిన వల్లీ, దేవసేన సమేత నాగేంద్రస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. స్వామి వారిని మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజలను వైభవంగా జరిపించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ లక్ష బిల్వార్చన పూజను కనుల పండువలా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు.